


# క్షీరసాగర మథనం

– నిర్మలాదిత్య

## (ప్రారంభం)

–1–

సెయింట్ పీట్, ఫ్లోరిడా

మార్చ్ 2014

'కథ చెప్పేవారు , వినేవారు  మనవారే అయ్యితే, ఆ కథలో మనవారంతా హీరో లే, మనం కాని వారంతా విలన్ లే', హైవే పక్కనే రెప రెపలాడుతూ ఎగురుతున్న జండా చూసి అనుకున్నాడు విశ్వం, తనలో తానే  నవ్వుకుంటూ.  ఇరవై ఏళ్ళు పైగా నార్త్ ఈస్ట్ న్యూ యార్క్ సిటీ లో పని చేసిన తరువాత, ఫ్లోరిడా కు మకాం మార్చడం ఆనందాగానే ఉంది విశ్వం కు. మొదటి మార్పు వాతావరణం. మరీ అంత వేడి, మరీ అంత  చలి కాని ప్రదేశం. స్నో పడటం అరుదే. వాతావరణం తో పాటు పక్కనే  సముద్రం, అందమైన  బీచ్ లు బాగా నచ్చాయి విశ్వం కు. ఇక కొట్టొచ్చినట్టు కనిపించే రెండో మార్పు ఇక్కడ నివసిస్తున్న వారి రాజకీయ నమ్మకాలు. ఒబామా అంటే నచ్చకపోతే పరవాలేదు కానీ, బానిసత్వానికి, జాతి భేదాలకు చిహ్నం అయ్యిన కాన్ఫెడరేట్ జండాలు ఎగరవేయడం, అదీ, వేల  కొద్దీ దృష్టి ఆకర్షించే విధంగా  హై వే  పక్కన. తాను పోవలసిన ఆఫీసు ఎగ్జిట్ రావటం తో కారు మలుపు తిప్పాడు విశ్వం.

ప్రోగ్రాం చేసిన మర మనుష్యులు లాగా, కార్లు గరాజి వైపు నడిపించి, పార్క్ చేసి ఆఫీస్ వైపు నడుస్తున్నారు ఉద్యోగులు, పొద్దున్నే 8 గంటలకంతా. విశ్వం కూడా ఆ జనంతో కలిసాడు.  కాలేజి ఆవరణలా, పచ్చిక బయళ్ళు, చుట్టూ పూల చెట్లు, మొక్కలు, పొదలతో అందంగా లాండ్స్కేప్ చేశారు. తన దగ్గరున్న న్యూ యార్క్ బ్యాడ్జ్, స్కానర్ కి చూపెట్టిన వెంటనే, తలుపుల తాళం తెరిచి నట్లు క్లిక్ అన్న శబ్దం వినపడింది. తలుపు తెరుచుకొని లోపలికి పోతే రిసెప్షన్ డెస్క్, ఆ

డెస్క్ రెండు వైపుల ఉద్యోగులు లోపల పోవడానికి, మెట్రో రైలు స్టేషన్ కుండే లాగా గేట్లు. విస్సు మళ్లీ బ్యాడ్జ్ సెన్సార్ మీద పెడితే బీప్ అన్న శబ్దం తో, సెలూన్ తలుపులు లాగా ఉన్న గాజు అద్దాలు తప్పుకుని, విస్సు కు దారి వదిలాయి. పొద్దున కాబట్టి, నిరంతరంగా ఆఫీసు వస్తున్న ఉద్యోగుల బ్యాడ్జ్ లకు స్పందించి వస్తున్న బీప్, బీప్ శబ్దాలు సుప్రభాతంలా, చిరపరిచిత మైన పాటలాగా ఓ ప్రశాంతతను కలిగిస్తున్నాయి. విస్సు ఎలివేటర్ లో పోయిన తరువాత, మూడో అంతస్తు బటన్ చూసాడు. పచ్చగా వెలుగుతోంది. ఎవరో అప్పటికే, నొక్కినట్లున్నారు. ఎలివేటర్ బయట పడి చూస్తే మరో సెక్యురిటి గేట్. మళ్లీ బ్యాడ్జ్ స్కాన్ చేసి లోపల అడుగు పెట్టాడు విస్సు.

విస్సు కలవాల్సిన మేనేజర్ ఆఫీసు తలుపు దగ్గిరే ఉంది.

" హలో బెత్, నేను విస్సును. మీ డిపార్ట్మెంట్ లో జాయిన్ అవ్వుదామని వచ్చాను", అన్నాడు విస్సు.

బెత్ తల ఎత్తి, కళ్ళ మీద పడుతున్న బంగారు వన్నె, వంకీలు ఉన్న జుట్టును సవరించుకుంటూ, " హలో విస్సు. వెల్కమ్. నువ్వు వస్తావని ఎదురు చూస్తున్నాను. ఆఫీసు రావడంలో, కష్టమేమీ పడలేదు కదా", అని నవ్వింది. బెత్ నవ్వితే తన పచ్చ వర్ణం లో ఉన్న కళ్లలో కూడా ఓ మెరుపు.

"నో బెత్. సులభంగానే ఆఫీసు పట్టుకోగలిగాను. కాదంటే ఇక్కడ సెక్యూరిటీ గేట్లు ఎక్కువనిపించాయి", అని అన్నాడు.

" నువ్వు ఇది వరకు పని చేసింది న్యూ యార్క్, హై రైస్ బిల్డింగ్. ఇప్పుడు దక్షిణం వచ్చావు. ఈ ఫ్లోరిడా రాష్ట్రం లో భూమికి కొదువ లేదు. అందుకే మన బ్యాంక్ ఓ విశాల ప్రదేశం కొని అక్కడక్కడ బిల్డింగ్ లు కట్టేశారు. ప్రతీ బిల్డింగ్ 3 అంతస్తుల కంటే ఎక్కువ ఎత్తు లేదు. అయినా ముందు, ఇక్కడి వాతావరణం గురించి అడగాలి. న్యూ యార్క్ చలి తరువాత, ఇక్కడ ఏలా ఉంది? లెట్ అజ్ గో ఫర్ ఆ వాక్. నీకు మన ఆఫీసు బ్రేక్ రూమ్, రెస్ట్ రూమ్ చూపిస్తాను", అని లేచింది బెత్.

" వాతావరణం చాలా బాగుంది బెత్. ఇరవై ఏళ్లు, న్యూ యార్క్ లో, ఆఫీసుకు ఇంటికి, అదీ చలికాలంలో కమ్యూట్ చేసిన తరువాత, ఇది స్వర్గమే. అదీ కాక చాల మటుకు ఇన్వెస్ట్మెంట్ బ్యాంకర్ గానే పనిచేశాను. కాబట్టి, మొబిలిటీ ప్రోగ్రాం క్రింద, మీరూ పనిచేస్తున్న ఆంటీ మనీ లాండరింగ్ డిపార్ట్మెంట్ లో అవకాశం, అదీ ఫ్లోరిడా రిలోకేషన్ అంటే వెంటనే ఒప్పుకున్నాను", అన్నాడు విశ్వం.

" రిలోకేషన్ కష్టమే కదా.మీ ఆవిడ, పిల్లలు ఒప్పుకున్నారా?", బ్రేక్ రూంలో తన కొక కాఫీ చేసుకొని బెత్ అడిగింది.

"ఒకటే అమ్మాయి. కాలేజీలో ఉంది. కాబట్టి ఎంప్టీ నెస్ట్. మా ఆవిడ నాన్ ప్రాఫిట్స్ కి పనిచేస్తుంది. తనకు ఇక్కడ ఉద్యోగం వేదుక్కోవడంలో పెద్ద సమయం పట్టలేదు. ఇల్లు కూడా సులభంగానే కొనుక్కోగలిగాం", అన్నాడు విస్సు, నిమ్మ అల్లం ఉన్న హెర్బల్ టీ పేకెట్ తీసి, వేడి నీళ్లలో కలిపి టీ చేసుకుంటూ.

"గ్రేట్. ఫస్ట్ ఫ్లోర్ లో చాలా రెస్టారెంట్స్ ఉన్నాయి. రెస్ట్ రూమ్స్ ప్రతీ ఫ్లోర్ లో చివరన ఉన్నాయి. ఆఫీసు ఈమధ్యనే మార్చారు. నీవు ఎక్కడైనా కూర్చోవచ్చు. నిల బడి కానీ, స్టేషనరీ బైక్ మీద వ్యాయామం చేస్తూ కూడా పని చేయడానికి సదుపాయాలు ఉన్నాయి. ఈ గోడ వెంబడి మీటింగ్ రూమ్స్ ఉన్నాయి. వీడియో కాన్ఫరెన్సు తో పాటు అన్నీ మీటింగులు ఈ రూముల నుండి పాల్గొనచ్చు", అంటూ ఓ మీటింగ్ రూమ్ కు దారి తీసింది, బెత్.

"నువ్వు వస్తావని ముందే బుక్ చేసా ఈ మీటింగ్ రూమ్ ను. టేక్ ఆ సీట్. నీ వు ఇది వరకు బ్యాంకులో చేసిన పని గురించి చెప్పు", అని అడిగింది బెత్, విశ్వం ను ఉద్దేశిస్తూ.

"ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ మీకు తెలియంది గాదు. ప్రంపంచంలో ఉన్న అన్ని ఆర్ధిక మార్కెట్ లను క్షుణ్ణంగా అర్ధం చేసుకోవడం, మన దగ్గర బ్యాంకింగ్ చేస్తున్న పెద్ద పెద్ద కంపెనీలకు సలహాదారులుగా వ్యవహరించడము, వాళ్ళ వ్యాపారానికి డబ్బు కావాలిస్తే, స్టాక్, బాండ్ మార్కెట్లనుండి సేకరించడం, వారి దగ్గర ఎక్కువ డబ్బు ఉంటే దానిని మార్కెట్లో మంచి వడ్డీ వచ్చేటట్లు అప్పివ్వడం లాంటి పనులు", అన్నాడు విశ్వం.

"నీ ట్రాక్ రికార్డ్ చూసాను.  ఇంతకు ముందు నీ బాస్ తో కూడా మాట్లాడాను. నీకు చాలా మంచి పేరు ఉంది. మా ఆంటీ మనీ లాండరింగ్ డిపార్ట్మెంట్ కు ఎందుకు వచ్చావు.  ఇక్కడ మేము చేసే పని పైన, నీకు అవగాహన ఉందా?", కొంచెం అనుమానంగా ఆడిగింది బెత్.

"సామాన్య పరిజ్ఞానం ఉందండి. నల్లధనం నేర వృత్తుల వల్ల, తీవ్రవాదుల అవసరాల వల్ల పుట్టుతుంది. దానికి తోడు పన్నులు ఎగగొట్టాలని,  అకౌంటెంట్లు, లాయర్ల చేసే డొంక తిరుగుడు యత్నాల వల్ల, నల్ల ధనం మరింత కూడు తుంది. ఈ డబ్బు ను ఎలానో ఓ బ్యాంక్ లాంటి ఆర్ధిక సంస్థలో జమ చేసి, పొరలు పోరాలుగా ఆ డబ్బును ఒక అకౌంట్ నుంచి మరో అకౌంటు కు మార్చి, చివరకు ఇలా ఆ ధనం లోని నల్లదనం పోగొట్టి,  సొంత దారుడికి అందజేయడం. బెసికెళ్ళి, ప్లేస్మెంట్,  లేయరింగ్, ఇంటెగ్రేషన్ అర్ ది 3 స్టేజెస్ ఇన్ మనీ లాండరింగ్.  మీ డిపార్ట్మెంట్ లో సందేహాస్పద ట్రాంసాక్షన్స్ చూస్తున్నారని, దానికి ఓ మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న ఉద్యోగి కోసం చూస్తున్నారని తెలిసింది. కెరీర్ లో

ముందుకు పోవడానికి, ఇదో గొప్ప అవకాశమని తెలుసు. మీ దగ్గర పని చేయడానికి, నేను ఎదురు చూస్తున్నాను," అన్నాడు విశ్వం.

బెత్ నవ్వుతూ," అవును, అకౌంట్ లలో అనుమానాస్పదముగా ఏది కనిపించినా, ఇన్వెస్టిగేట్ చేయాలి. మీకు అకౌంట్లు, వాటికి సంబంధించిన వివరాలు పంపిస్తాను. మీరు పరిశీలించిన తరువాత ఓ సారి మళ్ళీ కలిసి మాట్లాడుదాము", అని వీడ్కోలు తీసుకుంది.

విశ్వం ఎక్కడ పని మొదలు పెడదాం అని చుట్టూ చూసాడు. ఎవరు ఎక్కడైనా పని చేయొచ్చు కాబట్టి, తన టీమ్ లో పని చేస్తున్న మిగిలిన వారిని కలవడం కష్టమే. టీమ్ మీటింగ్ పుణ్యమా అని, వారంలో ఒక సారి మీటింగ్ రూంలో కలవచ్చునేమో.

కిటికీ పక్కన, ఒక్క ఓ స్టాండింగ్ వర్క్ స్టేషన్ కనిపించించింది. ఓ గంట నిలబడి పనిచేస్తూ, అటూ ఇటూ తిరిగుతూ, కనపడిన వారితో పరిచయం చేసుకోవచ్చునని అక్కడ వెళ్లి లాగ్ ఆన్ అయ్యాడు విశ్వం. బెత్ నుంచి రెండు మెయిల్స్ కనిపించాయి. మొదటి మెయిల్ టీమ్ కందరికి పంపించింది. విశ్వం ను ఆహ్వానిస్తూ, టీమ్ కు విశ్వంను పరిచయం చేస్తూ. రెండో మెయిల్ లో తను ఈ కొత్తపని చేయడానికి తీసుకోవాల్సిన ట్రైనింగ్ లు, చదవ వలసిన డాక్యుమెంట్స్, ప్రెసెంటేషన్ల కి లింకులు ఉన్నాయి.

విశ్వం ముందు చదవవలసిన వాటిమీద పడిపోయాడు. ఆఫీసుకు బయలుదేరే ముందే, విశ్వం, తన మొబైల్ ఫోన్ సైలెంట్ లో పెట్టాడు. వైబ్రెట్ అయ్యింది. ఫోన్ తీసుకొని అప్రయత్నంగా సమయం, కాల్ నంబర్ చూసాడు. ఓ గంట అయ్యింది చదవడం మొదలు బెట్టి. ఫోన్ నంబర్ క్లినిక్ ది. ఇక్కడ ఆఫీసు లో జాయిన్ కావడానికి ముందు రెండు వారాలు సెలవు తీసుకున్నాడు. న్యూయార్క్ నుంచి వచ్చిన ట్రక్ లోని వస్తువులు కొత్త ఇంట్లో అమర్చడానికి, కొత్త డ్రైవర్ లైసెన్స్ తీసుకోవడానికి, ఎలక్ట్రిసిటీ, నీళ్ల బిల్లులు మార్చడానికి, ఇతర చిల్లర పనులకు ఆ సమయం సరిపోయింది. అలానే ఇంటి దగ్గరే ఉన్న ఓ ఫ్యామిలీ డాక్టర్ ని కూడా ఎంచుకున్నారు. పనిలో పని అని, విశ్వం తను ప్రతీ ఏడాది చేసుకొనే ఫిజికల్స్ పరీక్షలు కూడా ముగించేసుకున్నాడు.

డాక్టర్ నుంచే కాల్. ఫోన్ ఎత్తుకుంది విశ్వం అని ఖరారు అయ్యాక "విశ్వం అన్నీ బాగా ఉన్నాయి. లిపిడ్ పానెల్, షుగర్ లిమిట్స్ లోనే ఉన్నాయి. కానీ నువ్వు ఏభై ఏళ్ళు దాటాయి కాబట్టి, పి ఎస్ ఏ టెస్ట్ ఆర్డర్ చేసాను. రీడింగ్ ఎక్కువగా ఉంది. భయపడాల్సిన పని లేదు కానీ, యూరాలోజిస్ట్ ను కలవాలి. కొందరు యూరాజిస్టుల పేర్లు ఇస్తాను" అంటూ కొన్ని ఫోన్ నంబర్లు ఇచ్చాడు.

విశ్వం కు పి ఎస్ ఏ అన్న పదమే కొత్తగా ఉంది. డాక్టర్ దాని గురించి చెప్పినా, పూర్తిగా అర్ధం కాలేదు. గూగుల్ చేసి చూసాడు విశ్వం. తాను చదివింది షాక్ లాగా అనిపించింది. వెంటనే దగ్గరే ఉన్న కుర్చీలో కూల బడి ఫోన్లో విన్నదంతా, పునరావృత్తం చేసుకోసాగాడు.

–2–

1984

- భోపాల్ లోని యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ ఫేక్టరీ ప్రమాదం నుండి మిథైల్ ఐసో సయనైట్ బయటకి పొక్కడం వల్ల దాదాపు 15,000 మంది మరణం, మరో 500,000 మందికి అసస్వత
- యూనియన్ కార్బైడ్ సి ఈ ఓ వాఽరెన్ ఆండర్సన్ ను అరెస్ట్. బెయిలు మీద విడిచిపెట్టిన ఆండర్సన్ పరార్

"పి.ఎల్, ఓ ఐదు నిమిషాలు ఖాళీగా ఉన్నావా?", పీర్ తలుపు తెరిచి అడిగాడు.

పి.ఎల్ దగ్గిర అప్పటికే, ఆఫీసు మేనేజర్ నిలబడి ఉన్నాడు. పీర్ ను రమ్మని, కూర్చో మని సంజ్ఞ చేసి,

ఆఫీస్ మేనేజర్ ను ఉద్దేశించి, "కెవి బ్యాంక్ కదా, వారి గోడౌన్ తలుపులు కుడి వైపు కున్నాయి. వెంట ఉండి అన్నీ సమాధానాలు ఇవ్వు. పోయేటప్పుడు ఆ కెవి బ్యాంక్ బోర్డ్, ఆ తాళం చెవులు కూడా పట్టుకెళ్లు. ప్రతీ సారి బ్యాంక్ వాళ్ళు, ఆ గోడౌన్ లో ఉన్న తోలు ముక్కలు బ్యాంక్ వారికి తాకట్టు పెట్టినట్లు రాసిన బోర్డ్ చూపెట్ట మంటారు. ఆ బోర్డ్ చూపెట్టి, తిరిగి వచ్చేటప్పుడు ఎదో కారణం చెప్పి, నీతో బాటు ఆ బోర్డ్ తెచ్చి అదిగో ఆ అరలోనే పెట్టు", అన్నాడు.

ఆఫీసు మేనేజర్ అరలో ఉన్న యూబీ బ్యాంక్ బోర్డ్ పక్కకు పెట్టి, కెవి బ్యాంక్ బోర్డ్ పట్టుకొని బయటకు వెళ్ళాడు.

పి.ఎల్ తన పూర్వీకులు విజయనగర సామ్రాజ్య సామంతులతో పాటు మధురకు వలస వచ్చారని చెప్తుంటాడు. ఇప్పటికీ వాళ్ళింట్లో తెలుగు మాటలు దొర్లుతూనే ఉంటాయి. పి.ఎల్ ముఖంలో, మాటల్లో ఆత్మీయత కొటొచ్చినట్లు కనపడుతుంది. జుబ్బా, కండువా, అడ్డ పంచ వేషధారణ. పళ్ళు గార పట్టినా, చిరు నవ్వు మిళితమైన కళ్ళ వైపు దృష్టి మళ్లడం వల్ల, సామాన్యంగా కనపడవు. అతని క్రింద పనిచేసే వాళ్ళెవరు, అతనిని వదలి వెళ్ళరు. పి.ఎల్ కు పని వారే కాదు, వారి కుటుంబాలు కూడా పరిచయమే. వారి క్షేమ సనాచారాలు కూడా పి.ఎల్ తరచు వాకబు చేస్తుంటాడు. ఆ ఆలోచనలు రాగానే, పీర్ మనస్సు చివ్వుకు మంది.

"కెవి బ్యాంక్ వాళ్ళు, యూబీ బ్యాంక్ వాళ్లు ఒకే సారి గోడౌన్ ఇన్స్పెక్షన్ వస్తే ఏమి చేస్తావు, పి.ఎల్?", కొంచెం వెటకారం గానే అన్నాడు పీర్, అటు పక్కన వేసిన చెక్క కుర్చీలో కూరుతుంటూ. పీర్ బనియన్ దానికింద లుంగీ కట్టుకున్నాడు. వాటి మీద మరకలు, తాను చేస్తున్న పని వల్ల పడినవే. పీర్ పొట్టి అయినా, దృడంగా ఉన్నాడు. చక్కని, తెల్లటి పలు వరుస ఆ మరకలు మధ్య మెరుస్తున్నాయి.

"అలా రావడం అతి అరుదు. వచ్చినా, మొదట వాళ్ళు ఆఫీసు మేనేజర్ ను కలిసి కానీ పోరు. యూబీ వారి గోడౌన్ తాళం ఎడమవైపు తలుపుకున్నాయి. ఒక వేళ వాళ్లకు అనుమానం వచ్చినా, నేను మేనేజ్ చేస్తాను లే. మనం ముందే అనుకున్నట్టు, ఈ బ్యాంక్, బయటి గొడవలు, నాకు వదిలేయి. తోలు తయారీలో నీకున్నంత నైపుణ్యం ఎవరికి లేదు. దాన్ని పట్టించుకో. ఇద్దరూ కలిసి, ఈ బిజినెస్ ను, రెట్టింపు చేద్దాం", పీర్ గొంతులోని వెటకారం పట్టించుకోకుండా బదులిచ్చాడు, పి.ఎల్.

"రెట్టింపు లోన్ అయ్యితే ఇప్పటికే తీసుకున్నావు. ఒకే గోడౌన్ రెండు బ్యాంకులకు చూపెట్టి లోన్ వేరు వేరుగా తీసుకోవడం, నాకు సరి కాదనిపిస్తుంది. ఇదిగో నా జీతం కని నీవు ఇచ్చిన కెవి బ్యాంక్ చెక్ కూడా బౌన్స్ అయ్యింది. ఇప్పుడు నువ్వు కెవి బ్యాంకులో మన యూబీ బ్యాంక్ చెక్ వేసి, నన్ను డబ్బు తీసుకోమంటావు. ఈ లెక్కన మన బిజినెస్ ఎప్పుడో ఒకప్పుడు, పట్టుబడి దివాలా తీసి తీరుతుంది", ఆవేదనగా అన్నాడు పీర్.

"ఈ డబ్బు లెక్కలన్ని, నాకు వదిలేయమన్నాను కదా పీర్. నువ్వు చూస్తూ ఉండు, ఈ బిజినెస్ ను ఎక్కడికి తీసుకెళ్తానో. ఇక్కడ నుండి వెల్లూరు కి కాదు, ఒకే సారి, చెన్నై లో పెద్ద కంపెనీ గా మారుస్తాను. బిర్లా, టాటా కంపెనీలను మించి పైకి వెళ్లి చూపెడతాను", పి.ఎల్ కళ్ళలో అతని ఆశయాలు తళుక్కుమన్నాయి.

"బిర్లా, టాటా లు ఈ స్థితి కి చేరడానికి కొన్ని తరాలు పట్టింది. నీవు ఒక్క తరంలోనే వాళ్లని మించిపోగలవా? నేల విడిచి సాము చేయొద్దు పి.ఎల్. భూమి మీదకి రా", అన్నాడు పీర్

"నీకు చూపిస్తాను. నన్ను నమ్ము. ఈ ప్రయాణంలో నీ సహాయం కూడా కావాలి", అన్నాడు పి.ఎల్.

పీర్ ముఖంలో ఆందోళన ఛాయలు చూసి, పి.ఎల్ ఏంటి అన్నట్లు కను సంజ్ఞ చేసాడు.

పీర్ గోడ పైనున్న కేలండర్ చూసాడు. అట్ట మీద పి.ఎల్.ఎం లెదర్స్ అని ఇంగ్లీష్ లో ఉంది, దానికి క్రింద రోజుకొక్క తారీఖు, తిధులు ఉన్న కాగితాల గుచ్చం. చిన్నప్పటి నుంచి పి.ఎల్ తో ఉన్న స్నేహం గుర్తుకు వచ్చింది. ఇద్దరూ కలిసి ఈ బిజినెస్ మొదలు పెట్టడం గుర్తుకు వచ్చింది. తోలు వ్యాపారం, తనకు తరతరాలనుండి వచ్చిన విద్యనే. పి.ఎల్ కె కొత్త. కానీ పి.ఎల్ వంశస్తులు వ్యాపారస్తులు. కాకపోతే, ఈ తోలు పరిశ్రమనే కొత్త. ఇప్పటి వరకు బాగానే జరిగింది

బిజినెస్. కానీ గత రెండు ఏండ్లుగా, పి.ఎల్ కు బిజినెస్ పెద్దది చేయాలనే కోరిక పుట్టింది. అలాంటి ఉద్దేశ్యం సహజమే అయినా, ఆ ప్రయత్నంలో, పి.ఎల్ చేస్తున్న పనులు పీర్ కు నచ్చడం లేదు.

"పి.ఎల్ నాకు నువ్వు ఈ బిజినెస్ ను తీసుకెళ్తున్న దారి నచ్చలేదు. ఈ సంవత్సరాంతం తరువాత విడిపోదాం", అన్నాడు పీర్.

పి.ఎల్ మనస్సు చివుక్కు మన్నా పైకి చూపెట్టలేదు.

"నన్ను ఎలా వదిలి పోతావు పీర్. ఇద్దరం కలిసి మొదలు పెట్టాం కదా. అయినా నేను చేస్తున్న పనులు మన బిజినెస్ ఎదుగుదలకే కదా. నన్ను నమ్ము, ప్రయత్నం లో నన్ను నమ్మి పని చేస్తున్న వారిని కూడా నాతో బాటు పైకి తీసుకెళ్తాను. వారి నమ్మకాన్ని వమ్ము చేయను", అన్నాడు.

"నీవు, నిన్ను నీ బిజినెస్ మాత్రమే చూస్తున్నావు. నీవు చేసే  ఈ నేరాల వల్ల, బ్యాంక్ అప్పు కోసం ఎదురు చూస్తున్న మరో బిజినెస్  ఆ అప్పు దొరక్క నష్టపోవచ్చు. నీవే ఇలా అప్పులు చేసి, అప్పులు తీర్చలేక పోతే,  బ్యాంక్ కు నష్టం.  అది కూడా సంఘానికి దెబ్బే. టాక్స్ లు కూడా సరిగా కట్టకుండా దొంగ లెక్కలు చూపిస్తున్నావు. అలా ప్రభత్వం కి నష్టం కలిగిస్తే, ప్రజల అభివృద్ధి కి నష్టం కలిగినట్లే కదా. మనం కట్టే టాక్స్ డబ్బులతోనే కదా,  ప్రభత్వం అనేక ప్రణాళికలు అమలు పరుస్తుంది.   నీ నిర్ణయాల వల్ల ఓ నేరం చేస్తున్నాను అన్న ఆలోచన  నీలో ఇసు మాత్రం కూడా కనపడడం లేదు", బాధగా అన్నాడు పీర్

"పీర్, నేను మొదట నా కుటుంబ సౌఖ్యం చూసుకుంటాను. తరువాత నా బిజినెస్ లో నా కోసం పని చేస్తున్న ఉద్యోగులను,  నా కుటుంబం లాగానే చూసుకుంటాను. ఇక మిగిలిన బయట ప్రపంచం అంటావా, ఆ బాధ్యత నాది కాదు. ప్రభుత్వం ది అయ్యితే, ప్రభుత్వం నా లాగే ప్రజల శ్రేయస్సు చూసుకుంటుంది. ఆ ప్రయత్నం లో నన్ను నేరస్తుడిగా పట్టుకుంటే, నేను దాని పర్యసనాన్ని ఎదుర్కొనడానికి సిద్ధం. నాకు పని చేస్తున్న వారి మీద, నా కుటుంబం మీద ఈగ కూడా వాల నివ్వను. నా మీద నమ్మకం ఉంచు. నిన్ను నీ కుటుంబాన్ని కూడా ఈగ వాలనీయకుండా చూసుకుంటాను", అన్నాడు పి.ఎల్.

"నమ్మకం లేక కాదు పి.ఎల్.  ఏది తప్పు, ఏది సరి అనే ప్రశ్నకు మన సమాధానాలు వేరు. నేను ఎంత చెప్పినా నీకు అర్థం కాదు. మనం విడిపోవడమే మంచిది. ఓ మూడు నెలల సమయం ఇస్తాను. ఈ మూడు నెలలలో ఇంకో ఇద్దరికి పని నేర్పిస్తాను. నేను లేకున్నా, నీకు సమస్య రాకుండా చూసుకుంటాను", అన్నాడు పీర్.

"జుబేదా బాబీ కి చెప్పావా? సలీం, ఆయషా లు కూడా పసి వాళ్ళు కదా ఎలా చూసుకుంటావు?", ఆ విధంగానైన పీర్ మనస్సు మార్చుకుంటాడేమో నని ప్రయత్నించాడు పి.ఎల్.

"నువన్నది సరినే. జుబేదా నీ లాగానే ఆలోచిస్తుంది. రాజీ చేయడం కొంచెం కష్టమే. లెదర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వాళ్ళు కొత్తగా బ్రాంచ్ తెరుస్తున్నారు. అక్కడ ఉద్యోగం కోసం ప్రయత్నం చేద్దాం అనుకుంటున్నాను", అన్నాడు పీర్.

పి.ఎల్ ఆలోచించాడు. తన భార్య అభిరుచులు గుర్తుకు వచ్చాయి. పిల్ల వాడిని ఊటీలో బోర్డింగ్ స్కూల్ లో వేయాలన్న కోరిక గుర్తుకు వచ్చింది, తన ఆశయాలు గుర్తుకు వచ్చాయి. మొన్ననే నేషనల్ బ్యాంక్ నుంచి మాట్లాడిన ఆఫీసర్ వినోద్ గుర్తుకు వచ్చాడు.

"సరే పీర్, బిజినెస్ మొత్తం నేను తీసుకుంటాను. వెంటనే నీ భాగం పెట్టుబడి, లాభాలు ఇవ్వలేను. ఓ రెండు ఏళ్లలో వడ్డీ తో సహా ఇచ్చేస్తాను. నీకు ఈ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఏ సహాయం కావలసినా వచ్చేయి. అలానే నాకు ఎప్పుడు అవసరం అయ్యినా, నీ ఇంటికే నేరుగా వచ్చేస్తాను",అన్నాడు పి.ఎల్.

పీర్ అలా వెళ్ళగానే, నేషనల్ బ్యాంక్ కు ఫోన్ చేసి మేనేజర్ వినోద్ ను తన బిజినెస్ చూడడానికి పిలిచాడు. వినోద్ బజాజ్ స్కూటర్ మీద మధ్యాహ్నం మూడు గంటలకు దిగబడ్డాడు.

"పి.ఎల్ గారు నమస్తే", అన్నాడు వినోద్.

"అరే మీరు మేనేజరా? ఎంతో అనుభవం ఉండి నలభై దాటితే కానీ మేనేజర్ కారనుకున్న. నేను ఇది వరకు చూసి, కలసిన మేనేజర్లు అందరూ వయస్సు మీరిన వారే. మిమ్మల్ని చూస్తుంటే కాలేజి కుర్రాడి లాగా ఉన్నారు", ఆశ్చర్యంగా అన్నాడు పి.ఎల్.

"మీరు ఆశ్చర్య పడటం సరినే. కొన్ని సంవత్సరాల క్రిందనే కదా బ్యాంకుల జాతీయకరణ మైనది. బ్యాంకులు ఇప్పుడు వేగంగా, అన్నీ చిన్న చిన్న ఊర్లలోను బ్రాంచీలు తెరిచేస్తున్నారు. బ్యాంకులు ప్రతీ సంవత్సరము, పరీక్షలు పెట్టి కొంత మంది తెలివైన వారికి నేరుగా ఆఫీసర్ పదవులు ఇస్తారు. నేను కూడా అలా డైరెక్ట్ గా ఆఫీసర్ గా సెలెక్ట్ అయ్యాను. ట్రైనింగ్ తరువాత, ఇదే నా మొదటి పోస్టింగ్, ఈ ఊరి బ్రాంచ్ మేనేజర్ గా", వల్ల వేసాడు వినోద్. ఈ ప్రశ్న ఎదుర్కొనడం వినోద్ కి ఇది మొదటి సారి కాదు. అలానే తనకు బ్యాంకింగ్ గురించి తెలియదని తక్కువ అంచనా వేయడం కూడా కొత్త కాదు. ఆ అంచనాలను తారు మార్చే తన పరిచయం, ప్రవర్తన కూడా ఆనంద దాయక పరిణామమే.

పి.ఎల్ కు ఈ కుర్ర కారు మేనేజర్ తో మాట్లాడడం సరదా గానే ఉంది.

"ఎక్కడ ఉండటం? పిల్లలు ఎంత మంది? అయినా మా బిజినెస్ మీ బ్యాంక్ దృష్టి లో ఎలా పడింది?", కుతూహలంగా అడుగాడు పి.ఎల్.

"అబ్బే పెళ్లి ఇంకా కాలేదండి. బ్యాంక్ దగ్గిరే ఓ చిన్న గది బాడుగకు తీసుకొని ఉంటున్నాను", చిరు నవ్వుతో చెప్పాడు వినోద్.

" మీకు తెలుసు కదా, జాతీయకరణతో బ్యాంక్ బ్రాంచ్ లు బాగా తెరిచారు. ఈ ఊళ్ళోనే, ఈ సంవత్సరం రెండు కొత్త బ్రాంచీలు తెరిచారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్/బిజినెసెస్ అంటూ ఓ కొత్త డిపార్ట్మెంట్ పెట్టారు మా బ్యాంక్ లో. మా కొత్త బ్రాంచ్ ద్వారా ఇక్కడి చిన్న చిన్న పరిశ్రమలను అభివృద్ధి చేయాలని పథకం", వినోద్ వివరించాడు.

"దీని వల్ల మీ బ్యాంక్ కు కూడా డబ్బులు వస్తాయి కదా. అయినా మీ బ్యాంక్ మాకు ఏమి చేయ గలుగుతుంది?", పి.ఎల్ అడిగాడు.

"నన్ను ముందు మీ పరిశ్రమ గురించి అర్ధం చేసుకొనివ్వండి. మీ ఆర్ధిక అవసరాలను కూడా పరిశీలించి, నేను మీ బిజినెస్ మరింత ఎదగడానికి లోన్ ప్రపోసల్ పంపిస్తాను. అది మా హెడ్ ఆఫీస్ ఒప్పుకుంటే, ఇప్పుడు మీకు ఉన్న బ్యాంక్ లోన్లు అన్ని కట్టి మా దగ్గర మాత్రమే మీరు లోన్లు, బిజినెస్ చేసుకోవచ్చు", అన్నాడు వినోద్.

"అంటే ఇప్పుడున్న బ్యాంక్ లోన్ల బదులు మీ దగ్గర తీసుకోమంటున్నారు. ఇది మీకు లాభం కానీ, మా కెలా?", అన్నాడు పి.ఎల్.

"మా కొత్త డిపార్ట్మెంట్ వల్ల, బ్యాంక్ ఓ అప్పులవాడిలా కాకుండా మీ బిజినెస్ పార్టనర్ గా మారుతుంది. మీ బిజినెస్ అభివృద్ధి చెందడానికి, లాభాలు రావడానికి, అడుగడుగునా ఉంటుంది. అవకాశం ఇచ్చి చూడండి. నన్ను మీ పరిశ్రమ, మీ బిజినెస్ గురించి అర్ధం చేసుకోనివ్వండి. దాని తరువాత నేను ప్రపోసల్ రాసి మా హెడ్ ఆఫీస్ కు పంపించే ముందు మీతో సంప్రదిస్తాను. మీరు సరి అంటేనే నేని దానిని పైకి పంపిస్తాను", అన్నాడు వినోద్.

వినోద్ చెప్పిన దాంట్లో పి.ఎల్ కు అభ్యంతరమేమి కన పడలేదు. ఈ కొత్త లోను తో, ఇప్పుడు రెండు బ్యాంక్ లతో ఆడుతున్న దోబూచులాటలకు కూడా విరామం దొరుకుతుందేమోన్నన్న ఆశ కలిగింది. కాని ఈ ఆలోచనలేవి పి.ఎల్. ముఖంలో కనపడలేదు.

"సరే చూద్దాం. ఇప్పుడు మీ బ్యాంక్ కేమి కావాలి?", అన్నాడు పి.ఎల్.

"వీలైతే, నేను మీ పరిశ్రమ ఓ సారి చూడ వచ్చా?", అడుగాడు వినోద్.

"దానికేముంది,రండి", అంటూ లేచి గది వెనుకనున్న తలుపు తీసాడు. అది నేరుగా ఏ పెద్ద హాలు కు దారి తీసింది.

ఓ ప్రక్క లారీలలో నుంచి దించిన తోళ్లను, అంటుకున్న మాంసం, బొచ్చు, దుమ్ములను వేరు చేసి శుభ్ర పరుస్తున్నారు. మారు వైపు శుభ్రపరచిన తోళ్లను పంచల చాపులాగా, సన్నగా కోసి మళ్లీ శుభ్రపరుస్తున్నారు. వాసనలు ఘాటుగానే ఉన్నాయి. వినోద్ ముక్కు మీద చేతిగుడ్డ అడ్డుపెట్టుకొని అక్కడ జరుగుతున్న పని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. డిపార్ట్మెంట్ పనిలో పనిగా, రక రకాల పరిశ్రమలు పరిచయం చేసే పుస్తకం ఒకటి అచ్చేసింది. అప్పటికే ఆ పుస్తకం లో తోలు పరిశ్రమల గురించి చదివి వచ్చి నందు వల్ల, వినోద్ కి పి.ఎల్ చెప్పేదంతా సులభంగానే అర్థం అవ్వుతున్నది.

"ఇది టానింగ్ విభాగం", ఇది వరకు వేరు చేసిన సన్నటి తోళ్లను, నాంచి ఉన్న స్థలం చూపిస్తూ అన్నాడు పి.ఎల్.

వినోద్ కు తను అది వరకు చదివిన దానికంటే తేడా గా అనిపించింది.

"టానింగ్ ఎలా చేస్తున్నారు, చెప్పండి", అన్నాడు వినోద్

"ఇది తర తరాలనుండి వస్తున్న విద్యనేనండి. చెట్ల బెరడులు కలిపి ఈ తోళ్లను ఊరనిస్తాము. దానితో తోళ్ళు బట్టలలాగా మడవడానికి వీలవుతుంది.

ఎలాంటి వాతా వరణంలోనైన అలాగే మారకుండా ఉంటాయి", అన్నాడు పి.ఎల్.

వినోద్ కి ఈ బిజినెస్ కు తన బ్యాంక్ ఏలా ఉపయోగపడగలదో, ఎలా ఈ అకౌంట్ ఇప్పుడున్న బ్యాంక్ ల నుండి తన బ్యాంక్ కు మార్చుకోవచ్చునో , తళుక్కుమని అర్థం అయ్యింది.

"మీకు ఈ టానింగ్ ఎన్ని రోజులు పడుతుంది?",సమాధానం తెలిసినా, చిరు నవ్వుతో అడిగాడు వినోద్.

"కనీసం మూడు, నాలుగు వారాలు", ఎందుకన్న ముఖంతో అడిగాడు పి.ఎల్.

"మీరు క్రోమ్ టానింగ్ కు ఎందుకు మారటం లేదు? ఇదే పని వారం లోపాలనే అయ్యిపోతుంది. మీకు లాభం కూడా", అన్నాడు వినోద్.

"క్రోమ్ టానింగ్ గురించి విన్నాను. దానికి కొత్త పరికరాలు కొనాలి, మార్పులు చేర్పులంటే ఖర్చులే. దానికి తోడు క్రోమ్ టానింగ్ కు కావలసిన ముడి పదార్థాలు చెన్నై నుంచి తెచ్చుకోవాలి", అన్నాడు పి.ఎల్

"అందుకే, మా బ్యాంక్ కు మారడం వల్ల మీకు లాభం. ఇంకా బయటకి రాని విషయం మీకు చెప్తాను. మా హెడ్ ఆఫీసులో ఈ పేటలోనే ఓ క్రోమ్ ఫ్యాక్టరీ పెట్టడానికి ప్రపోసల్ ఉంది. అంతా పెద్ద వాళ్ళు. తొందరలోనే ఈ ఫేక్టరీ వస్తుంది. మీ ముడి సరుకు సమస్య తీరిపోతుంది. ఇక మీ మార్పులు చేర్పుల కు నేను ప్రపోసల్ మీతో మాట్లాడి పంపిస్తాను. ఓ వారం రోజులు, రోజుకో గంట కేటాయించండి. మీ బిజినెస్ ను మరో లెవెల్ కు మార్చేద్దాం. అన్నట్టు మీ ఆఫీసు ఫోన్ లో నన్ను ఒక ఫోన్ చేసుకొనివ్వండి", అన్నాడు వినోద్.

"ఇక చూపెట్టాల్సింది మేము తయారు చేసిన తోళ్లను స్టోర్ చేసిన గోడౌన్. దాని తాళం చెవులు బ్యాంక్ దగ్గర ఉన్నాయి, మీకు చూపెట్టాలేను. ఆఫీసుకు పోదాం పదండి", అన్నాడు పి.ఎల్.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments